సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 7 । జనవరి । 2025



వరిలో జింక్ లోపం

అధికంగా భాస్వరం ఎరువుల వినియోగంతో వరిలో జింక్ లోపం ఏర్పడుతుందని ఏఓ శ్రీనాథ్ తెలిపారు. వివరాలు 8లో ▸



సంప్రదాయ ఆహారం మేలు

యువత జంక్ ఫుడ్‌ను వదిలేసి, సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవాలని వక్తలు సూచించారు. వివరాలు 8లో ▸



రైతన్నా.. కల్తీలతో జాగ్రత్త!

కల్తీ ఎరువులు పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. – వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సింగూరుకు మహానీయుల పేర్లు



రాజనర్సింహ



ఎం.బాగారెడ్డి

పుల్‌కల్(అందోల్): ఉమ్మడి మెదక్ జిల్లా వరప్రదాయిని సింగూరు ప్రాజెక్టుకు మహనీయుల పేర్లను పెట్టారు. వారి సేవలను గుర్తించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో సింగూరు ప్రాజెక్టుకు బాగారెడ్డి పెట్టగా.. ప్రస్తుతం సాగునీటి కాలువకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర తండ్రి రాజనర్సింహ పేరును ఖరారు చేస్తూ మంత్రి మండలి ఆమోదం తెలిపింది. 2009లో అదనంగా ఏర్పాటు చేసిన లిఫ్టులకు కూడా రాజనర్సింహ పేరునే పెట్టారు. రాజనర్సింహ.. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పని చేశారు. ఈయన పేరు పెట్టడం పట్ల అందోల్ నియోజకవర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

సంగారెడ్డి టౌన్: వ్యవసాయానికి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ట్రాన్స్‌ఫారానికి ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయాలన, పత్తి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సింగూరు నీటితో చెరువులను నింపి కాల్వల పనిని మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా సభ్యులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఓబీసీ మోర్చా ఇన్‌చార్జి అనిల్



జోగిపేట(అందోల్): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఓబీసీ మోర్చా అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి గాజుల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జోగిపేటలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వాగ్దానాల అమలులో పూర్తి విఫలమైందని విమర్శించారు. రైతులను మభ్యపెట్టి నట్టేట ముంచుతోందని మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు ప్రభాత్‌కుమార్, నాయకులు ఆంజనేయులు, వినోద్ పాల్గొన్నారు.

8న టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర సమావేశం

హాజరుకానున్న మంత్రులు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, పొన్నం



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్

పటాన్‌చెరు: నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర రికగ్నైజ్డ్ మేనేజ్‌మెంట్ స్కూల్స్ అసోసియేషన్ (టీఆర్ఎస్ఎంఏ) ట్రస్మా ఆధ్వర్యంలో 8న రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, కోశాధికారి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. డిసెంబర్ 29న రాష్ట్ర సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం, మంత్రుల సమక్షంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థపై చర్చించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఈ సమావేశం ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సంఘంలో ఐదువేల మంది సభ్యులు ప్రైవేట్ స్కూళ్ల నుంచి సభ్యులుగా ఉన్నారని, దాదాపు 11వేల స్కూల్‌లు ఉన్నాయని చెప్పారు.

డబుల్‌లైన్‌కు గ్రీన్‌సిగ్నల్

ఆమోదం తెలిపిన రైల్వే బోర్డు
- వికారాబాద్–పర్లీ మధ్య 268 కిలో మీటర్ల మేర నిర్మాణం
- తీరనున్న లెవెల్ క్రాసింగ్ కష్టాలు

జహీరాబాద్: వికారాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా మహారాష్ట్రలోని పర్లీ వరకు డబుల్ రైల్వే లైన్ నిర్మాణానికి రైల్వే శాఖ ప్రతిపాదించింది. ఇప్పటికే ప్రాథమిక సర్వే పనులు సైతం పూర్తయ్యాయి. వికారాబాద్ నుంచి పర్లి మధ్య 268 కిలోమీటర్ల మధ్య దూరం ఉంది. ఆయా ప్రాంతాల మధ్య డబుల్ రైల్వేలైన్ నిర్మాణం పనులు చేపట్టేందుకు దక్షిణమధ్య రైల్వే బోర్డు ఆమోదించింది. ఇదే విషయాన్ని ఇటీవల రైల్వే స్టేషన్ పనులను పరిశీలించేందుకు వచ్చిన రైల్వే ఉన్నతాధికారులు సైతం వెల్లడించారు. నిర్మాణం పనులు చేపట్టేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సింగిల్ లైన్ మాత్రమే ఉంది. ఉన్న లైన్ పక్క నుంచి రెండో లైన్ నిర్మాణం పనులు చేపట్టనున్నారు. డబుల్ రైల్వే లైన్ నిర్మాణం కోసం అవసరమైన భూమి అందుబాటులో ఉంది. భూ సేకరణ సమస్య లేనందున పనులు ప్రారంభిస్తే త్వరితగతిన పూర్తి చేసే అవకాశం ఉంటుందనే అభిప్రాయం ఉంది. ఇప్పటికే రైల్వే గేట్ల వద్ద కాపాలాదారులు ఉండడంతో వాటిని యథావిధిగా ఉపయోగించుకోనున్నారు. ప్రస్తుతం వాగులపై ఉన్న వంతెనల వద్ద కొత్తగా బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన మేర నిధులను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం సైతం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.



జహీరాబాద్ రైల్వేస్టేషన్

తీరనున్న క్రాసింగ్ కష్టాలు

డబుల్ రైల్వే లైన్ నిర్మాణం పూర్తి చేయడం ద్వారా రైళ్ల రాక పోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. లెవెల్ క్రాసింగ్ కష్టాలు సైతం దూరం అవుతాయి. ప్రస్తుతం సింగిల్ లైన్ ఉన్నందున ఎదురుగా వచ్చే రైలుకు దారి ఇచ్చేందుకు గాను మరో రైలును వెనుక బాటు ఉన్న రైల్వే స్టేషన్లలో నిలుపుతున్నారు. దీంతో రైళ్ల సమయానుసారంగా నడవని పరిస్థితి తలెత్తుతోంది. సుమారు గంట నుంచి రెండు గంటల పాటు రైళ్లు గమ్యస్థానాలను ఆలస్యంగా చేసుకుంటున్నాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు. డబుల్ లైన్ మూలంగా వికారాబాద్, మర్పల్లి, కోహీర్, జహీరాబాద్, మెటల్‌కుంట, బీదర్, బాల్కి, కమలానగర్, ఉద్గీర్, లాతూర్‌రోడ్డు, పర్లి స్టేషన్ల మధ్య రైళ్ల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్, షిర్డీ, నాందేడ్, పర్లీ, పూణె, కాకినాడ, విజయవాడ, తిరుపతి, మచిలీపట్నం ప్రాంతాలకు రైళ్లు నడుస్తున్నాయి. డబుల్ రైల్వే లైన్ నిర్మాణంతో సకాలంలో రైళ్లు గమ్యస్థానాలకు చేరుకుంటాయి. ఇప్పటికే వికారాబాద్-పర్లీల మధ్య విద్యుత్ సదుపాయాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు.

పెరగనున్న రైళ్ల సంఖ్య

డబుల్ రైల్వే లైన్ నిర్మాణంతో రైళ్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రధాన నగరాలైన ముంబై, ఢిల్లీ, కల్‌కత్తా, చెన్నై లాంటి ప్రాంతాలకు రైళ్లను నడిపే సౌలభ్యం కలుగనుంది. అంతేకాకుండా గూడ్స్ రైళ్ల సంఖ్య కూడా పెరగనుంది. ప్రస్తుతం 30 వరకు రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. రైళ్ల సంఖ్య పెరగడం ద్వారా ప్రయాణికులకు మరింత మెరుగైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.

గంటల తరబడి నిలుపుతున్నారు



ప్రస్తుతం సింగిల్ లైన్ ఉన్నందున లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రైళ్లను గంటల తరబడి నిలుపుతున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడంలేదు. వికారాబాద్, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు అధికంగా ప్రయాణం సాగిస్తున్నారు. గూడ్స్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తుండటంతో నిలిపి ఉంచిన రైలు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. –నారాయణరెడ్డి, జహీరాబాద్

మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి



వికారాబాద్ నుంచి పర్లీ వరకు డబుల్ రైల్వే లైన్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. రైళ్ల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుంది. లెవెల్ క్రాసింగ్ ఇబ్బందులు తీరుతాయి. ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకునేందుకు వీలుకలుగుతుంది. –మాధవకృష్ణ, స్టేషన్ మేనేజర్–జహీరాబాద్

అతివలే అధికం



ఓటరు జాబితా రెడీ

- ఉమ్మడి మెదక్ జిల్లాలో పురుషులు: 14.16లక్షలు
- మహిళా ఓటర్లు : 14.52లక్షలు

సాక్షి, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. సవరించిన ఓటరు జాబితాను సోమవారం ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 28,70,233 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 14,52,905, పురుషులు 14,16,166, ఇతరులు 229, సర్వీస్ ఓటర్లు 933 మంది ఉన్నారు. కొత్తగా 20,458 ఓటర్లు నమోదు కాగా 11,769 మంది ఓటర్లను తొలగించారు.

పటాన్‌చెరులో అత్యధికం

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని పటాన్‌చెరు నియోజకవర్గంలో అత్యధికంగా, దుబ్బాక నియోజకవర్గంలో అత్యల్పంగా ఓటర్లు ఉన్నారు. పటాన్‌చెరు, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో పురుషులే అధికంగా ఉన్నారు. మిగతా నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. పటాన్‌చెరులో అధికంగా థర్డ్‌జెండర్లు ఉంటే, దుబ్బాకలో ఒక్కరు కూడాలేరు.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్	మొత్తం
సిద్దిపేట	1,17,509	1,22,459	71	103	2,40,142
హుస్నాబాద్	1,23,083	1,27,837	06	224	2,51,150
మెదక్	1,04,917	1,15,987	04	89	2,20,997
నారాయణఖేడ్	1,18,848	1,18,563	09	65	2,37,485
అందోల్	1,23,244	1,29,386	03	51	2,52,684
జహీరాబాద్	1,38,914	1,39,315	03	104	2,78,336
సంగారెడ్డి	1,24,235	1,28,097	38	62	2,52,432
నర్సాపూర్	1,11,611	1,18,701	05	38	2,30,355
పటాన్‌చెరు	2,15,945	2,03,466	85	73	4,19,569
దుబ్బాక	97,653	1,03,859	0	55	2,01,567
గజ్వేల్	1,40,207	1,45,235	05	69	2,85,516

ఖేడ్‌లో ఔటర్ రింగ్‌రోడ్డు

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- నిర్మాణ పనులకు భూమి పూజ

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా రింగ్‌రోడ్డుతోపాటు ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. పట్టణం సమీపంలోని కాంజీపూర్ రోడ్డు నుంచి నిజాంపేట–నారాయణఖేడ్–బీదర్ జాతీయ రహదారి వరకు నిర్మిస్తున్న రింగు రోడ్డు పనులకు పట్టణ శివారులోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెంకటాపూర్ సమీపం నుంచి ఔటర్ రింగురోడ్డును ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో రహదారులనూ విస్తరిస్తామని చెప్పారు. 40 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్న రింగురోడ్డుకు స్వచ్ఛందంగా రైతులు భూములు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్ చౌహాన్, మాజిద్, రామకృష్ణ, రమేష్ చౌహాన్, తాహెర్‌అలీ, వీరన్న, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే ఖేడ్‌లోని తన స్వగృహంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు రాధాకిషన్, మాణిక్ గౌడ్ పాల్గొన్నారు.



రింగ్‌రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

దాబాల్లో విస్తృత తనిఖీలు



కుళ్లిన చికెన్‌ను చెత్త డబ్బాలో పారబోయిస్తున్న అధికారులు



సంగారెడ్డి: కల్తీ ఆహారం, జంక్ ఫుడ్‌ల కారణంగా ప్రజలు రోగాల బారిన పడకుండా ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కంది శివారులో ఉన్న కింగ్స్– 1, కింగ్స్– 2 దాబాలను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అమృత ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో పాడైన చికెన్ బిర్యానీ, మైదా, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఫుడ్ కలర్స్ శాంపిల్స్ సేకరించారు. రెండు దాబాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. నాణ్యమైన ఆహారం అందించకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మరో 7 సహకార సంఘాలు!

- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- ఇప్పటికే 53 సంఘాలు
- ఫిబ్రవరితో ముగియనున్న పాలక వర్గం పదవీకాలం

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో మరిన్ని సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుంది. నూతనంగా ఏర్పాటైన మండలాలతోపాటు మరికొన్ని గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలనే ఆదేశాలు రావటంతో రైతులకు సౌలభ్యకరంగా ఉండేందుకు మరికొన్ని సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించారు. జిల్లాలో ఏడు నూతన పరపతి సంఘాలు ఏర్పాటు అయ్యే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 53 ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 37 డీసీసీబీ బ్యాంకు పరిధిలో ఉండగా, 16 ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలో ఉన్నాయి. జిల్లాలో చాలా చోట్ల సరైన విధంగా సంఘాలు లేకపోవటంతో రైతులు సేవలను పొందలేక పోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న సహకార సంఘాల పాలక వర్గం సభ్యుల పదవీకాలం ఫిబ్రవరిలో ముగియనుంది. కొత్త పాలక మండలి ఏర్పాటులోపే మరికొన్ని సంఘాలు ఏర్పాటు చేయనున్నారు. 2013 సంవత్సరంలో సంఘాల ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తగా ఏర్పాటు చేయలేదు. సహకార సంఘాల ద్వారా రైతులు పండించిన వివిధ రకాల ధాన్యాన్ని ప్రభుత్వాలు నిర్ణయించిన మద్దతు ధరలతో కొనుగోళ్లు చేస్తుంటారు. అదే విధంగా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను సరఫరా చేస్తారు. ఈ విధంగా ప్రతి సంవత్సరం రూ.కోట్లలో లావాదేవీలు జరుగుతాయి. రైతులు పంటల సాగు కొరకు సంఘంలోని సభ్యులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందిస్తారు. అంతే కాకుండా వ్యాపారాల అభివృద్ధికి రుణాలను మంజూరు చేస్తారు. జిల్లాలో ఉన్న సంఘాల పరిధి ఎక్కువగా ఉండటంతో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. కొత్తగా ఏర్పాటైన మండలాల్లో సహకార సంఘాలు లేకపోవటంతో ఆయా మండలాల్లోని రైతులు ఇతర మండలాల్లోని సంఘాలకు వెళ్తూ ఇబ్బందులు పడ్డారు.



కంది ప్రాథమిక పరపతి సహకార కేంద్రం

నూతన సంఘాలకు పంపిన ప్రతిపాదనలు

మండలం	ఏర్పడే సంఘం
నాగల్‌గిద్ద	నాగల్‌గిద్ద
కంగ్టి	తడ్కల్
నిజాంపేట	నిజాంపేట
జహీరాబాద్	జహీరాబాద్
హత్నూర	వడ్డెపల్లి
మునిపల్లి	మునిపల్లి
సదాశివపేట	ఆత్మకూరు

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీసు ప్రాంగణంలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకతతో జరుగుతుందని చెప్పారు. సొంత స్థలం కలిగి ఉన్న నిరుపేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 5లక్షల సహాయం అందించనున్నట్లు తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటింటి సర్వే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మూడు విడతల్లో లబ్ధిదారుడికి నిధులు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చలపతిరావు, ఎంపీడీవో యాదగిరి, డీఈ రవీందర్, ఏఈ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, విజిలెన్స్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

● కమనీయం.. రథోత్సవం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి వైకుంఠపుర మహాలక్ష్మి గోదా సమేత విరాట్ వేంకటేశ్వర స్వామి రథోత్సవం సోమవారం కనుల పండువగా కొనసాగింది. యువ వికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథోత్సవంలో రామానుజ జీయర్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు ప్రత్యేక పూజలు చేసి రథాన్ని ముందుకు నడిపించారు. మహిళలు అడుగడుగునా స్వామివారికి హారతి పట్టారు. రథం ఎదుట కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువతీ యువకులు భక్తి గీతాలకు అనుగుణంగా నృత్యం చేస్తూ ముందుకు సాగారు. డోలు వాయిద్యం, గుస్సాడీ నృత్యం భక్తులను అలరించాయి. పోతిరెడ్డిపల్లి చౌరస్తా పీఎస్ఆర్ గార్డెన్ నుంచి వైకుంఠపురం ఆలయం వరకు దారిపొడవునా భక్త బృందం భజనలు చేశారు.



సంగారెడ్డిలో వేంకటేశ్వర స్వామి రథోత్సవం

ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

సంగారెడ్డి జోన్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓ, ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా మండలాలలో జరుగుతున్న సర్వేపై మండల అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సొంత స్థలం ఉన్న అర్హులైన నిరుపేదలకు ప్రాధాన్యతాక్రమంలో ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలకు ఖాళీ స్థలం ఉన్న వారికి మొదటి విడతలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనింగ్ కలెక్టర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను సందర్శన

ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ క్రాంతి సందర్శించారు. సీళ్లను, సీసీటీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో అడిషనల్ కలెక్టర్ మాధురి తదితరులు

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

సంగారెడ్డి జోన్: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, మాధురి, డీఆర్ఓ పద్మజరాణి, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోతిమాత జాతరకు రండి

హరీశ్‌రావును ఆహ్వానించిన ఎమ్మెల్యే



హరీశ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ఈనెల 12వ తేదీ నుంచి మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి తండాలో నిర్వహించనున్న మోతిమాత దేవాలయం జాతరకు హాజరు కావాల్సిందిగా మాజీ మంత్రి టి.హరీశ్‌రావును ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. సోమవారం హరీశ్ క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు ఆహ్వానించారు. గిరిజనుల ఆరాధ్య దైవం అయిన మోతిమాత జాతర మినీ మేడారంను తలపించేలా జరగనుందని, హాజరై మాతను దర్శించుకుని వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సంజీవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బంజారా నాయకులు కేషుసింగ్, శంకర్‌నాయక్, నారాయణజాదవ్, గోపాల్, బానోతు, రామ్‌శెట్టి, లింబాజీ, చంద్రశేఖర్, దేవిదాస్, లక్ష్మణ్, స్వామిచందర్ పాల్గొన్నారు.

గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో అంతర్రాష్ట్ర కేజర్ యాఫై గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ ఈ నెల 14 కొనసాగనుండగా మధ్యప్రదేశ్, బిహార్, ఒరిస్సా, తెలంగాణ, ఢిల్లీ, జమ్ముకాశ్మీర్, కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, విదర్బ తదితర రాష్ట్రాల నుంచి 16 జట్లు పాల్గొంటున్నాయి. విజేత జట్టుకు రూ.6.11 లక్షలు, రన్నరప్‌కు రూ.3.55 లక్షల నగదు ప్రైజ్‌మనీ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం రెండు లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. ఫస్ట్ లీగ్ మ్యాచ్‌లో టీహెచ్‌ఆర్ జట్టును బళ్లారి సీసీ జట్టు ఓడించింది. రెండవ లీగ్ మ్యాచ్‌లో నిజామాబాద్ జట్టుపై రాయల్ కార్స్ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను ఆహ్వాన కమిటీ చైర్మన్ రాములు నేత, తహయాఫై తదితరులు అందజేశారు.

89 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

సిద్దిపేట సీపీ అనురాధ



డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా 89 కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆదివారం రాత్రి పోలీసు సిబ్బంది ఆకస్మిక వాహనాల తనిఖీ నిర్వహించి డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేశారన్నారు. ఇందులో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ ఉపేందర్, రూరల్ సీఐ శ్రీను, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జింక్ లోపం.. జాగ్రత్తలతో మాయం



- అధిక భాస్వర వినియోగంతో వరికి ముప్పు
- జింక్ సల్ఫేట్‌తో లోపాన్ని సవరించుకోవాలి
- సిద్దిపేట అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: వరిలో అధికంగా భాస్వరం ఎరువుల వినియోగంతో జింక్ లోపం ఏర్పడుతుందని, దీని నివారణకు నారుమడిలోనే జింక్ సల్ఫేట్‌ను వెదజల్లుకోవాలని సిద్దిపేట అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ సూచించారు. మండలంలోని నాంచార్‌పల్లి గ్రామంలో పురుమాండ్ల ఇంద్రసేనారెడ్డికి చెందిన పొలంలో జింక్ లోప లక్షణాలని గుర్తించి రైతులకు తగు సూచనలు చేశారు.

జింక్ లోపానికి దారి తీసే పరిస్థితులు..

నేలలో అధిక భాస్వరం వినియోగంతో జింకు లోపం ఏర్పడుతుంది. వరిలో అత్యధికంగా లోపించే మూలకం జింకు. ఆధునిక రకాలు, పంటల ముమ్మర సాగు, జింకు అధికంగా తీసుకునే రకాల వాడకంతో లోప లక్షణాలు పెరుగుతున్నాయి. జింకు లోపం ప్రధానంగా తటస్థ, సున్నపు, పంట మార్పిడి చేయని, మురుగు నీరు బయటకు వెళ్లే సౌకర్యం లేని, క్షారత్వపు, చౌడు నేలలు, ఇసుక నేలలు, ఫాస్పరస్, సిలికాన్ మూలకాలు అధికంగా ఉన్న నేలలు, కోతకు గురయ్యే నేలల్లో జింకు లోపం అధికంగా ఉంటుంది. కాలుష్యపు మురుగు నీరు పారించే నేలలు, అధికంగా సేంద్రియ ఎరువులు, పంట వ్యర్థాలు వాడే నేలల్లో కూడా జింకు లోప లక్షణాలు కనిపిస్తాయి.

నాలుగు వారాల్లో లక్షణాలు బయటికి

- సాధారణంగా ప్రధాన పొలంలో నాటిన రెండు నుంచి నాలుగు వారాల్లో జింకు లోప లక్షణాలు కనిపిస్తాయి.
- మొక్కలు గిడసబారుతాయి, గిడస బారిన మొక్కల ఆకులపై బ్రౌన్ మచ్చలు కనిపిస్తాయి.
- మొక్కలు అసహజంగా పెరుగుతాయి. పొలంలో అక్కడక్కడా అంతగా ఏనుకోని మొక్కలు ఉంటాయి.
- నత్రజని ఎరువులు వేసినప్పటికీ పైరు పచ్చపడదు. కంకుల్లో తాలు ఏర్పడుతుంది.
- లేత ఆకుల్లో మొదలు దగ్గర, మధ్య ఈనెలు పాలిపోతాయి. ఆకు మధ్య ఈనెల వెంబడి తెల్లని చార ఏర్పడుతుంది. ఆకు వ్యాసార్థం తగ్గుతుంది. ఆకులు పెలుసుగా ఉండి, వంచగానే శబ్ధం చేస్తూ విరిగిపోతాయి. - పొలంలో నీరు ఎక్కువగా ఉన్న సమయంలో బైకార్బొనేట్ల సాంద్రత పెరిగి పంట తొలి దశలో జింకు లోపం లేత ఆకుల్లో కన్పిస్తుంది. అయితే 4–6 వారాలలో పంట తిప్పుకుంటుంది.
- ఒకవేళ మొదల్లో లోప లక్షణాలు ఎక్కువగా ఉంటే పంట ఆలస్యంగా కోతకు వస్తుంది. దిగుబడులు తగ్గుతాయి.



జింకు లోపం ఏర్పడిన వరి పైరు



నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న ఏఓ

తీసుకోవాల్సిన చర్యలు...

- వరి నారుమడుల్లో జింకు సల్ఫేట్ వెదజల్లాలి. 2 నుంచి 4 శాతం జింకు ఆక్సైడ్ ద్రావణంలో నారు ముంచి ప్రధాన పొలంలో నాటాలి.
- వరి పంట పండించే భూముల్లో ప్రతీమూడు పైర్లకు ఒకసారి, రెండు పంటలు పండించినట్లయితే ప్రతీ యాసంగిలో ఆఖరి దమ్ములో ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి.
- లీటరు నీటికి 20 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి ఐదురోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి.
- జింకు సల్ఫేట్ భాస్వరం ఎరువుతో కలిపి వేయరాదు. ఈ రెండింటి వాడకానికి మధ్య కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి.
- పురుగు, తెగుళ్ల మందులను జింకు సల్ఫేట్ ద్రావణంలో కలిపి వాడరాదు.

కులవృత్తిదారులకు పథకాలు ప్రవేశపెట్టాలి

మేదర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్ మహేంద్ర

సంగారెడ్డి రూరల్ : కుల వృత్తిదారులకు ప్రభుత్వం పథకాలు ప్రవేశపెట్టాలని మేదరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర కోరారు. సోమవారం పట్టణం మేదర, బాంబు కట్టేల దుకాణదారుల సమావేశంలో శ్రీధర్ మహేంద్ర మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తి దారులకు ఆర్థిక సహాయం సోసం సబ్సిడీ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకోవాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో వెనుకబడిన కుల వృత్తి దారులకు పెట్టుబడి సాయం, రుణ సాయం అందక వ్యాపారం నడవలేని పరిస్థితి ఉందని, అనేకమంది కుల వృత్తి దారులు కూలి చేసే పరిస్థితి నెల కొందన్నారు. అలాగే, పట్టణంలోని బాంబు కట్టెల వ్యాపారులు ఐక్యంగా సంఘం నిర్ణయానికి కట్టుబడి వ్యాపారం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేదర, వెదురు, బాంబు దుకాణదారుల సంఘం నాయకులు సైదులు, నారాయణ, రాజు, వెంకట్, విజయ, సరిత తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ పుష్పన్ కుమార్



సమావేశం మాట్లాడుతున్న పుష్పన్ కుమార్

పటాన్‌చెరు టౌన్: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ పుష్పన్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మాదక ద్రవ్యాల'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పుష్పన్ కుమార్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా సుమారు 11 కోట్ల మంది యువత మాదక ద్రవ్యాలకు బానిస అయినట్టుగా లెక్కలు చెబుతున్నాయన్నారు. అదే విధంగా పొరుగు రాష్ట్రాల నుంచి మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు రవాణా అవుతున్నాయని వాటిని నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. యువత ఒత్తిడిని దూరం చేసుకోవడానికి జల్సాలకు అలవాటు పడుతున్నారన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ వినాయక్ రెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సీనియర్ అధ్యాపకులు ప్రవీణ, అధ్యాపకులు డాక్టర్ పూనం కుమారి, డాక్టర్ శివ దీప్తి, డాక్టర్ కరుణ కుమారి, డాక్టర్ సుజాత, డాక్టర్ విమల షరీఫ్ మియా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వెంకటేశం, డాక్టర్ కరుణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై తోటి విద్యార్థులు దాడి

పటాన్‌చెరు బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో ఘటన



కన్ను, ముఖంపై దెబ్బలతో సాయి



వీపుపై గాయాలు చూపుతున్న కార్తీక్

పటాన్‌చెరు టౌన్: బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులపై సహచర విద్యార్థులు రాత్రి సమయంలో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధిత విద్యార్థుల తల్లిదండ్రుల కథనం మేరకు.. పటాన్‌చెరు బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో సాయి, కార్తీక్ తొమ్మిదో తరగతి చదువుతున్నారు. శనివారం అర్ధరాత్రి వరకు చదుకొని పడుకున్న సాయిపై తోటి విద్యార్థులు విద్యుత్ లైట్లు ఆపి దాడి చేశారు. మరుసటి రోజు కార్తీక్‌పై దాడికి పాల్పడ్డారు. ఇందులో తీవ్రంగా గాయపడిన విద్యార్థులను పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వసతి గృహం ఎదుట ఆందోళన చేసి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాచ్‌మెన్ నిర్లక్ష్యంగా ఉండటంతో రాత్రి సమయంలో దాడి జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలిసిన బీసీ సంక్షేమశాఖ అధికారులు అసలు ఏం జరిగింది అనే విషయంపై ఆరా తీస్తున్నారు. గాయపడ్డ విద్యార్థులు మొదట తనకు కింద పడ్డామని చెప్పారని, తర్వాత తోటి విద్యార్థులు దాడి చేశారని చెప్పినట్లు వార్డెన్ శోభారాణి తెలిపారు.

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న మోదీ

- ప్రైవేటీకరణ వల్ల సామాజిక న్యాయానికి తూట్లు
- సెమినార్‌లో సీపీఎం నేత జాన్‌వెస్లీ



సెమినార్‌లో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ తన పాలనలో రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ''కేంద్ర ప్రభుత్వ విధానాలు–రాజ్యాంగం, రిజర్వేషన్లపై ప్రభావం''అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఆర్టికల్ 46 ప్రకారం ఆర్థిక సమానత్వం సాధించాల్సిన అవసరాన్ని అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపర్చారని చెప్పారు. ఇన్నాళ్ల భారతావనిలో పాలకులు అనుసరించిన విధానాల వల్ల అసమానతలతో కూడిన దేశంగా మిగిలిందని విచారం వ్యక్తం చేశారు. ప్రపంచంలో అతిపెద్ద ధనిక దేశంగా భారత్ ఐదో స్థానంలో ఉందని, త్వరలోనే మూడో స్థానానికి చేరుకోబోతున్నామని మోదీ గొప్పలు పలుకుతున్నారని మండిపడ్డారు. వాస్తవంగా భారత్ మాత్రం అందుకు భిన్నంగా ఉందన్నారు. ఆకలితో అలమటిస్తున్న దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉందని, 30 శాతం జనాభాకు ఇప్పటికీ నిలువ నీడలేదని గుర్తు చేశారు. దేశంలో 10 శాతంగా ఉన్న సంపన్నుల చేతుల్లో 57 శాతం సంపద పోగై ఉందని, 50 శాతంగా ఉన్న పేదల చేతుల్లో మాత్రం 11 శాతం సంపద మాత్రమే ఉందన్నారు. దేశ బడ్జెట్‌కు సరితూగేలా అదానీ ఆదాయం రూ.16 లక్షల కోట్లకు మించిపోగా.. కోటాను కోట్ల మంది భారతీయులు మాత్రం రెండు పూటల తిండికి నోచుకోని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఒకే మతం, ఒకే దేశం, ఒకే ఎన్నికలంటూ బీజేపీ మత ప్రాతిపాదికన నియంతృత్వ పద్ధతులకు శ్రీకారం చుడుతున్న పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, అడివయ్య, మాణిక్యం, జిల్లా నాయకులు బాగారెడ్డి, అశోక్, సురేష్, శివ, నాగభూషణం పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి : వీరారెడ్డి



మాట్లాడుతున్న వీరారెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): ఇష్టంతో చదివి భయం లేకుండా పరీక్షలు రాయాలని శాసన మండలి అసిస్టెంట్ సెక్రటరీ, మోటివేటర్ బీ.వీరారెడ్డి సూచించారు. సోమవారం చిన్న శంకరంపేట మండలం సూరారం జెడ్పీ పాఠశాల ఆవరణలో పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చెప్పింది వినడంతోపాటు ఒకసారి ఇంటి వద్ద రివైజ్ చేసుకుంటే సబ్జెక్ట్‌పై పట్టు సాధిస్తారన్నారు. పరీక్షల కోసం సంసిద్ధమవడంతోపాటు జీవితంలో ముందుకు సాగేందుకు తీసుకోవాల్సిన అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సూరారం, ధరిపల్లి పాఠశాల విద్యార్థులు, హెచ్‌ఎంలు సాయిరెడ్డి, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

పాపన్నపేట(మెదక్): హత్య కేసులో నిందితులైన ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, సెషన్స్ జడ్జి లక్ష్మీశారద సోమవారం తీర్పునిచ్చినట్లు మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పేటకు చెందిన దొంతి నారాయణ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన కోలన్ రామక్రిష్ణ, బీరంగూడకు చెందిన కొమ్ము ప్రసాద్‌కు రూ.10 వేలు అప్పుగా ఇచ్చాడు. ఆ డబ్బులను తిరిగి ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో రామక్రిష్ణ, కొమ్ము ప్రసాద్ ఇద్దరూ దొంతి నారాయణను 19 నవంబర్ 2019న పాపన్నపేట మండలం ఏడుపాయలకు తీసుకొచ్చి కత్తితో గొంతు కోసి హత్య చేశారు. అప్పటి సీఐ రాజశేఖర్, ప్రస్తుత సీఐ రాజశేఖర్ రెడ్డి విచారణ చేయగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ ఫజల్ అహ్మద్ కోర్టులో వాదనలు వినిపించారు. ఈ మేరకు జడ్జి లక్ష్మీశారద నిందితులిద్దరికీ జీవిత ఖైదుతోపాటు రూ. 15 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో రూ.5 లక్షలు చోరీ

నగదుతోపాటు ఆభరణాలు అపహరణ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐ

దుబ్బాకరూరల్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని రామక్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. సంగెపు రాజమణి తన కుమారుడు నవీన్‌తో కలిసి 4వ తేదీన అక్బర్‌పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో బంధువుల ఇంట్లో దశదినకర్మకు వెళ్లారు. రాజమణి భర్త బాలయ్య కూలీ పని చేస్తూ ఇద్దరు కూతుళ్లతో కలిసి హైద్రాబాద్‌లో ఉంటాడు. రాజమణి తన కుమారుడితో కలిసి 5న సాయంత్రం ఊరు నుంచి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో చూడగా సుమారు రూ.5 లక్షల నగదు, 5 తులాల బంగారం, 4 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించారు. సిద్దిపేట ఏసీపీ మధు, సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. అక్బర్‌పేట భూంపల్లి మండలం నగరం గ్రామ ఎక్స్‌రోడ్డులో శ్రీరామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి విద్యా సాంస్కృతిక సంబురాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతోపాటు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోధనకే పరిమితం కాకుండా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల స్టేజిఫియర్ పోతుందన్నారు. పలు రకాల ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న కళను బయటకు తీయొచ్చన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసలు కావొద్దన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ అంజయ్య, మల్లేశం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని కౌలు రైతు ఆత్మహత్య

కల్హేర్(నారాయణఖేడ్): ఉరేసుకొని కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్హేర్ మండలం బీబీపేట్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశం కథనం మేరకు.. గ్రామానికి చెందిన కర్రెకుర్మ గంగారం(42) వరుసకు మరదలైన సత్యమ్మ వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. కౌలు డబ్బుల విషయంలో ఇద్దరికి గొడవ జరిగింది. భూమి కౌలు తీసుకొని చేస్తే తీవ్ర నష్టం వచ్చిందని మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశం తెలిపారు.

తాగుడుకు బానిసై వ్యక్తి..

చేగుంట(తూప్రాన్): తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మాసాయిపేట మండల పరిధిలోని నాగసాన్‌పల్లి గ్రామంలో జింక కృష్ణ (45) కొంత కాలంగా తాగుడుకు బానిసై పని చేయకుండా నిత్యం ఇంట్లో గొడవలు పడుతుండేవాడు. సోమవారం తన గుడిసెలో సీలింగ్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య అనిత, కుమారుడు రిషిక్ ఉన్నారు. మృతుడి అన్న జింక ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి విద్యార్థులే.. భావి భారత పౌరులు

సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్



విద్యార్థులతో అప్పాల ప్రసాద్

దుబ్బాక : నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ జీ అన్నారు. సోమవారం దుబ్బాక పట్టణంలోని సరస్వతీ గ్లోబల్ స్కూల్‌లో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, పరీక్షలకు సన్నద్ధత, ఉన్నత ఫలితాలు సాధించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రుల కలను నిజం చేయాలన్నారు. కార్యక్రమంలో వేదిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రుక్మిణీ, ఎంఈఓ ప్రభుదాసు, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్, ట్రెస్మా అధ్యక్షుడు రవీందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందించారు.

చలి పంజా.. లైట్లతో ప్రయాణం

సంగారెడ్డి క్రైమ్: జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. సంగారెడ్డి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పటికే వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ చేసింది. ఉదయం వేళల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో ప్రయాణికులు, స్కూల్ బస్సులు, వాహనదారులు వాహనాల లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పొగమంచు వల్ల రోడ్లపై ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా మారిందని వాహనదారులు వాపోయారు.



లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న వాహనాదారులు

సాంప్రదాయ ఆహారాన్ని తీసుకోవాలి

- యువత జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత
- ఘనంగా పచ్చి కందుల పండుగ



వంటకాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: యువత జంక్ ఫుడ్‌ను వదిలేసి, సాంప్రదాయ ఆహారాన్ని తీసుకోవాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. సోమవారం కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో నవకల్పన కార్యక్రమంలో భాగంగా పచ్చికందుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి పండుగలు తెలంగాణ ఆహార సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు. మన ఆహార సంస్కృతీ ఎంత సరళమైనదో అంతే స్వచ్ఛమైనదన్నారు. జంక్‌ఫుడ్, రెడీమేడ్ ఫుడ్‌ను వదిలి సహజమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమ రూపకర్త, తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ మట్టా సంపత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతను సాంప్రదాయ ఆహారం వైపు మళ్లించేందుకు పచ్చికందుల పండుగను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగు విద్యార్థులు గుడాలు, కుడుములు, సర్వపిండి, రొట్టె, బగారన్నం, ఉప్పుప్యాలాలు, ఉడకబెట్టిన, కాల్చిన కందికాయ, కందుల సేమ్యా, కందుల న్యూడిల్స్, కందుల మిక్షర్, సలాడ్ తదితర 80 రకాల వంటకాలను ప్రదర్శించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది వంటకాలను తిలకించి రుచిచూసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు పిట్లదాసు, వెంకటరమణ, సంపత్ కుమార్, శైలజ, నరేశ్, రామస్వామి, నర్సింలు, సాయిసురేశ్‌తోపాటు ఆయా విభాగాల అధ్యక్షులు, యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.